
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



సోమశిలలో 65.12 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 65.12 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 23,490 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,09,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,819
మూడు శాతం జీఎస్టీతో	రూ.10,114
నవర (8 గ్రాములు)	రూ.80,912

గరిష్టం/కనిష్టం 37.2 /28.1

వాతావరణం

జిల్లాలో ఎండల తీవ్రత శుక్రవారం అధికంగా ఉంటుందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 45 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ), కావలిలోని పీజీ సెంటర్లలో గెస్ట్ ఫ్యాకల్టీగా నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు పీజీతో పాటు, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులు వీఎస్‌యూలో ఈ నెల 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు vsu.ac.in ను సంప్రదించాలని సూచించారు.

ఐటీఐలో 8న జాబ్‌మేళా

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జాబ్‌మేళాను ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల ఎనిమిదిన నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 కంపెనీలు హాజరుకానున్నాయని వెల్లడించారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

నెల్లూరు (టౌన్): నిరుద్యోగ యువతకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణను ర్యాంప్ పథకం ద్వారా నిర్వహించనున్నామని జిల్లా పరిశ్రమల అధికారి మారుతిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం సర్టిఫికెట్లను అందజేయనున్నామని వెల్లడించారు. 18 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులని, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డుతో నెల్లూరులోని సమతా నర్సింగ్ హోమ్ మూడో ఫ్లోర్‌లో దరఖాస్తులను ఈ నెల పదిలోపు అందజేయాలని కోరారు. వివరాలకు 90001 73808, 81213 31514 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బీఎడ్‌లో ఉత్తమ ఫలితాలు

నెల్లూరు (టౌన్): బీఎడ్ మూడో సెమిస్టర్ ఫలితాల్లో సంతపేటలోని ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన తెలిపారు. కళాశాలలో విద్యార్థులను గురువారం అభినందించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఫర్హానా సుల్తానా 8.91, భవానీ 8.82 పాయింట్లను సాధించారని వివరించారు.

నలుగురు ఏఓలకు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి

నెల్లూరు(పొగతోట): జెడ్పీ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న నలుగురు పరిపాలనాధికారులకు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతులను కల్పిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. వీరిలో నెల్లూరులోని జెడ్పీ, సంగం, దుత్తలూరు, అల్లూరు ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏఓలుగా పనిచేస్తున్న వాసుదేవరావు, శైలజ, ఎం వెంకటేశ్వర్లు, పీ వెంకటేశ్వర్లు ఉన్నారు. దీనిపై ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్కాకుల పెంచలయ్య, ప్రసన్నకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయానికి తోడ్పాటు

నెల్లూరు(పొగతోట): పురుగు మందులు, రసాయన ఎరువుల్లేని ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై నగరంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. అధిక మొత్తంలో వినియోగిస్తున్న పురుగు మందులు, రసాయన ఎరువులతో తీవ్రమైన వ్యాధులొస్తున్నాయని, వీటిని నివారించేందుకు గానూ ప్రకృతి వ్యవసాయం కీలకమని చెప్పారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమార్, డీఆర్డీఏ పీడీ నాగ రాజకుమారి, యానిమల్ హస్బెండరీ జిల్లా అధికారి రమేష్‌నాయక్, ఏడీహెచ్ అనూరాధ, అడిషనల్ డీపీఎం మునిరత్నం పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): దంపతుల నడుమ మనస్పర్థల నేపథ్యంలో భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసును వేదాయపాళెం పోలీసులు గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. డైకస్ రోడ్డులోని ఎస్సీసీ కాలనీలో నివాసం ఉంటున్న మస్తానయ్య (36)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఏసీ మెకానిక్‌గా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆయన ఇటీవల వేరే యువతితో సన్నిహితంగా మెలగసాగారు. దీంతో దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. పెద్దలు మందలించినా ఆయన తీరులో మార్పు రాలేదు. ఈ క్రమంలో దంపతుల నడుమ బుధవారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన మస్తానయ్య.. ఇంట్లో తలకు వెంట్రుకలు వేసే రసాయనాన్ని తాగుతానని భార్యను బెదిరించారు. ఇది గుర్తించిన ఆమె దాన్ని తీసి పారేశారు. ఆపై హాల్లోని హుక్కుకు ఉరేసుకొని ఆత్మహత్యకు అర్ధరాత్రి పాల్పడ్డారు. విషయాన్ని గుర్తించిన భార్య కుటుంబసభ్యుల సహకారంతో ఆయన్ను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

నెట్‌ను నెట్టేశారు..

మారుతున్న కాలానికనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్ బోధనను అందించేందుకు గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వినూత్న సంస్కరణలను అమల్లోకి తీసుకొచ్చింది. ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, టోఫెల్, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ తదితరాలను చేరువ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వీటికి మంగళం పాడేలా అడుగులేస్తోంది. ప్రైవేట్ వ్యవస్థకు ప్రాధాన్యమిస్తూ.. సర్కార్ బడులను నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సర ప్రారంభం నుంచే ఏ గవర్నమెంట్ స్కూల్లో నెట్ పనిచేయడంలేదనే విషయం విస్మయానికి గురిచేస్తోంది.

- విద్యా సంవత్సర ప్రారంభం నుంచి ఇదే తంతు
- ఆగిపోయిన ఆన్‌లైన్ బోధన
- హాట్‌స్పాట్ ఆన్ చేసి యాప్‌లలో నమోదు
- నిరుపయోగంగా ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు
- అటకెక్కిన ట్యాబ్‌ల పంపిణీ
- ఇదీ ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ తీరు



నెల్లూరు (టౌన్): ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం పావులు కదుపుతోందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, టోఫెల్, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ తదితరాలకు ఇప్పటికే మంగళం పాడింది. తాజాగా గవర్నమెంట్ స్కూళ్లలో ఇంటర్నెట్ సౌకర్యం నిలిచిపోయింది. విద్యా సంవత్సర ప్రారంభం నుంచే ఇదే సమస్య నెలకొంది.

హాట్‌స్పాటే దిక్కు..

ఈ పరిణామాల క్రమంలో హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్లలో హాట్‌స్పాట్‌ను ఆన్ చేసుకొని యాప్‌లలో నమోదు చేస్తున్న పరిస్థితి నెలకొంది. మారుమూల ప్రాంతాల్లో సిగ్నళ్లు అరకొరగా వస్తుండటంతో అక్కడ సమస్య తప్పడంలేదు. ఇంటర్నెట్ నిలిచిపోవడంతో ఆయా పాఠశాలల్లో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలను పక్కన పడేశారు. దీంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి.

నెట్ డేటా మొత్తం దీనికే..

ప్రభుత్వ పాఠశాలల్లో హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్లలోని హాట్‌స్పాట్‌ను ఆన్ చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన వివరాలు, బాత్‌రూమ్‌ల ఫొటోలు, మార్కుల ఎంట్రీ, లెసన్ వీడియోలను షేర్ ఇట్ ద్వారా ప్లే చేయాల్సి ఉంటుంది. అయితే డేటా మొత్తం యాప్‌ల నమోదుకే సరిపోతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని పూర్తి స్థాయిలో కల్పించాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో సజావుగా..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఆన్‌లైన్ బోధనకు నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. తొలుత అన్ని స్కూళ్లలో ఏపీ ఫైబర్‌నెట్, ఎయిర్‌టెల్, బీఎస్సెన్నెల్, జియో, వీఐ తదితర సంస్థలతో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసి, అందులో పాఠాల కంటెంట్‌ను అప్‌లోడ్ చేసి ఇంటికెళ్లి చదువుకునే అవకాశాన్ని సౌకర్యం కల్పించారు. 1324 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, 428 చోట్ల స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు స్మార్ట్ టీవీలు.. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఐఎఫ్‌పీల ద్వారా బోధనకు శ్రీకారం చుట్టారు. 41 స్కూళ్లలో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేశారు.

జిల్లాలో ఇలా..

గవర్నమెంట్ స్కూళ్లు - 3221

విద్యార్థులు - 1.9 లక్షల మందికిపైగా

నెట్ సౌకర్యం ఉన్నవి - 2350

కొత్తగా సిమ్‌లు ఇచ్చింది - 1380

పనిచేయని సిమ్‌లు

ప్రస్తుత విద్యా సంవత్సర ప్రారంభంలో 1380 పాఠశాలలకు జియో సిమ్‌లను అందజేశామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. అయితే ఇందులో ఏదీ పనిచేయడంలేదు. మిగిలిన సంస్థల ఇంటర్నెట్ సేవల పరిస్థితీ ఇంతే కావడం గమనార్హం. గతంలో కొన్ని పాఠశాలలకు రూటర్లు ఇచ్చినా, అవీ పనిచేయడంలేదు. ఈ వ్యవహారంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవని పలువురు పేర్కొంటున్నారు. ఫలితంగా ఆన్‌లైన్ బోధనకు బ్రేక్ పడింది. ట్యాబ్‌లను సైతం విద్యార్థులు పక్కన పడేశారు.

త్వరలో అందుబాటులోకి..



ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం త్వరలో అందుబాటులోకి రానుంది. ఇటీవలే జియో సిమ్‌లను అందజేశాం. వీటికి సంబంధించిన నెట్ ఇచ్చే యత్నాల్లో ఉన్నాం. ఇటీవల కొంత సాంకేతిక సమస్య ఏర్పడింది. ఇబ్బంది లేకుండా హెచ్‌ఎంల హాట్‌స్పాట్‌తో యాప్‌లు, ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నాం.

– వెంకటసుబ్బయ్య, ఏపీసీ, సమగ్రశిక్ష

కూటమి పాలనలో వ్యవసాయం కుదేలు



విలేకరులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రైతులకు తప్పని తిప్పలు
- హామీల అమల్లో చంద్రబాబు విఫలం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం

మనుబోలు: 'కూటమి పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైంది. రైతులకు తిప్పలు తప్పడం లేదు' అని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మనుబోలు మండల కేంద్రంలోని చిట్టమూరు అజయ్‌రెడ్డి నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. రైతులు యూరియా కోసం రోడ్డెక్కే పరిస్థితి నెలకొందన్నారు. యూరియాను మార్క్‌ఫెడ్ ద్వారా కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. ఆర్బీకేల ద్వారా ఎందుకు సరఫరా చేయరని నిలదీశారు. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అవసరమైనవన్నింటినీ ఆర్బీకేల ద్వారా నేరుగా అందజేశారన్నారు. యూరియా దొరక్క ఓ వైపు రైతులు గగ్గోలు పెడుతుంటే, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఊరుకునేది లేదంటూ చంద్రబాబు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. జిల్లాలో రెండో పంట కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం ఎందుకు ధాన్యానికి మద్దతు ధర ప్రకటించలేదని ప్రశ్నించారు. పుట్టి ధాన్యం రూ.19,770 ఉండగా, దళారులు రూ.15 వేలకే రైతుల నుంచి కొనుగోలు చేస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ నెల 9న ఆర్డీఓ కార్యాలయాల వద్ద ఆందోళనలకు పిలుపునిచ్చామన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఆడబిడ్డ నిధి పథకం కింద ప్రతి మహిళకు రూ.1,500 ఇస్తానని చెప్పిన చంద్రబాబు మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, తల్లికి వందనం పథకాన్ని సైతం అరకొరగా అమలు చేశారని విమర్శించారు. దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయగా, వైఎస్సార్సీపీ ఆందోళనలతో మళ్లీ ఇస్తున్నారని తెలిపారు. చంద్రబాబు పాపాలన్నీ ప్రజలు లెక్కిస్తున్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ, నాయకులు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, సూరపనేని కిశోర్ నాయుడు, కసిరెడ్డి ధనుంజయరెడ్డి, గుండాల ఆదినారాయణ, గుమ్మడి వెంకటసుబ్బయ్య, దాసరి భాస్కర్‌గౌడ్, గుంజి రమేష్, గిరి, దయాకర్, నవకోటి తదితరులు పాల్గొన్నారు.

38 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

నెల్లూరు (టౌన్): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని 38 మంది ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నారు. 36 మంది ఉపాధ్యాయులు, ఇద్దరు స్కౌట్ టీచర్లతో కలిపి మొత్తం 38 మంది అవార్డులను అందుకోనున్నారు.

దర్జాగా కబ్జా

- ప్రభుత్వ భూమి అనే బోర్డున్నా లెక్కచేయని వైనం
- గ్రావెల్‌ను భారీగా కొల్లగొడుతూ..
- రెవెన్యూ అధికారుల సహకారం



మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

కలువాయి (సైదాపురం): ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. దాన్ని కబ్జా చేయడంలో కూటమి నేతలు ముందు వరుసలో ఉంటున్నారు. తాజాగా వీరి కన్ను మండలంలోని వెంకటరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న భూమిపై పడింది. రూ.లక్షల విలువజేసే దీన్ని దర్జాగా ఆక్రమించి.. మట్టిని కొల్లగొడుతూ యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కుల వ్యవహారాలను మీడియా బయటపెడుతున్న తరుణంలో రెవెన్యూ వారు సైతం కొత్త ట్రిక్కులను నేర్చుకుంటున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేయగానే ముందుగానే ప్రభుత్వ బోర్డును పెట్టి.. పగలూ, రాత్రనే తేడా లేకుండా మట్టి తోలుకునేందుకు ప్రోత్సహిస్తూ తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు.

కొత్త కథలు..

నేషనల్ హైవేను ఆనుకొని ఉన్న భూమి ముందుంది ప్రభుత్వ భూమి అని.. వెనుకుంది మాత్రం పక్కా అంటూ రెవెన్యూ అధికారులు కొత్త కథలు చెప్తున్నారు. రూ.30 లక్షల విలువజేసే ప్రభుత్వ భూమిని కూటమి నేతలు కబ్జా చేస్తున్నా, అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మరోవైపు నేషనల్ హైవే అథారిటీ అధికారులూ నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారు. జంక్షన్ల వద్ద తూర్పు, పడమర 40 నుంచి 50 మీటర్ల స్థలం కలిగి ఉండాలి. వీటికి పరిహారాన్నీ ఇచ్చారు. భూములను ఆక్రమిస్తున్న వ్యవహారం వీరికి తెలిసినా పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లును సంప్రదించగా, వెంకటరెడ్డిపల్లి జంక్షన్ వద్ద నేషనల్ హైవేను ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 360లో కొంత ప్రభుత్వ భూమి ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. దీనిక వెనుక వైపు పట్టా ల్యాండ్ అని తెలిపారు. ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని చెప్పారు. మట్టిని అక్రమంగా తోలుతున్న విషయమై ఎలాంటి చర్యలు చేపట్టారని ప్రశ్నించగా, సమాధానాన్ని దాటేశారు.

ఉపాధి శ్రామికుల ఆకలి కేకలు

- మూడున్నర నెలలుగా అందని వేతనాలు
- రూ.70 కోట్లకుపైగా బకాయిలు
- 65 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యం
- ఇప్పటి వరకు చేసింది 63.61 లక్షలు
- అదనంగా మంజూరు చేయని కేంద్రం

వారందరూ శ్రామికులు. ఉపాధి పనులు చేయగా వచ్చే వేతనాలతోనే తమ బతుకు బండిని నెట్టాలి. అయితే వీరి పొట్టకొట్టేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఏకంగా నాలుగు నెలల నుంచి వీరికి నగదును అందించలేదంటే సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. వీరికి మొత్తం రూ.70 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. ఈ పరిణామాలతో పనులకు హాజరవ్వాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

సంవత్సరం	పనిదినాల లక్ష్యం (లక్షల్లో)	పూర్తి చేసినవి (లక్షల్లో)	శాతం
2020 - 21	107.57	107.37	99.82
2021 - 22	124.49	128.87	103.52
2022 - 23	106.56	113.14	106.18
2023 - 24	120	119.73	99.78
2024 - 25	63	99.57	158.04
2025 - 26	65	63.61	97.87

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ శ్రామికులకు వేతనాలు మూడున్నర నెలలుగా అందలేదు. వీరు చేసిన పనులకు గానూ దాదాపు రూ.70 కోట్ల మేర చెల్లించాల్సి ఉన్నా, మీనమేషాలను ప్రభుత్వం లెక్కిస్తోంది. ఇవి అందక శ్రామికులు నానా అగచాట్లు పడుతున్నారు. శ్రామికులతో పనులు చేయిస్తున్న అధిక శాతం మంది ఉద్యోగులదీ ఇదే పరిస్థితి.

ప్రశ్నల వర్షం

కూలీలకు రెండు వారాల వేతనాలను మే 21న చెల్లించారు. అప్పటి నుంచి వీరికి చిల్లిగవ్వ అందలేదు. పనుల పర్యవేక్షణకు వెళ్తున్న అధికారులపై ప్రశ్నల వర్షాన్ని శ్రామికులు కురిపిస్తున్నారు. ఈ నిధులను కేంద్రం నుంచి తీసుకురావడంలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలమైంది. 2021 నుంచి ఉపాధి పని దినాలు ఏటా కోటికిపైగానే ఉన్నాయి. అయితే కూటమి సర్కార్ కొలువుదీరాక ఇవి పెరగలేదు. గత ఆర్థిక సంవత్సరంలో 1.19 కోట్ల పని దినాలను పూర్తి చేయగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.2 కోట్ల లక్ష్యాన్ని కలెక్టర్ ఆనంద్ నిర్దేశించారు. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం వీటిని పెంచలేదు. ఈ ఆర్థిక సంవత్సర ప్రారంభంలో 65 లక్షల పనిదినాల లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించగా, ఇప్పటి వరకు 63.61 లక్షల మేరే పూర్తి చేశారు. మిగిలిన లక్ష్యం రెండు వారాల్లో పూర్తికానుంది. ఆ తర్వాత శ్రామికులకు పనులుండవు.



పనులు చేస్తున్న కూలీలు

అదనంగా కల్పిస్తేనే ప్రయోజనం

వాస్తవానికి కేంద్రం నిర్దేశించిన పనిదినాలు ఆగస్టులో పూర్తవుతాయి. మంత్రులు చర్చించి వీటిని అదనంగా మంజూరు చేయించాలి. ఇలా చేయడం ద్వారా డిసెంబర్ వరకు శ్రామికులకు పనులు లభించేవి. అయితే ప్రస్తుతం రాష్ట్ర మంత్రులు, అధికారులు కేంద్రంతో చర్చించినా, ఎలాంటి ఫలితం లేదని సమాచారం. వీటిని అధికంగా కల్పిస్తే దాని ద్వారా వచ్చే మెటీరియల్ కాంపొనెంట్‌తో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర భవన నిర్మాణాలకు నిధులు మంజూరవుతాయి.

పనుల కేటాయింపులోనూ రాజకీయాలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులకు ఉపాధి పనులను కల్పించడంలేదు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను కూటమి సర్కార్ భారీగా తొలగించింది. వారి స్థానంలో రాజకీయ నేతలు తమ అనుచరులను నియమించారు. నూతనంగా పనిచేస్తున్న వీరు తమ అనుయాయులకే పనులు కల్పిస్తున్నారు. దుత్తలూరు, కావలి, దగదర్తి, బోగోలు తదితర మండలాల్లో ఈ తంతు అధికంగా ఉంది. ఫలితంగా పనుల్లేక.. వేతనాలు అందక శ్రామికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఎనిమిది వారాలు పనిచేశాం



ఉపాధి పనులకు గతంలో రోజూ హాజరయ్యేవాళ్లం. ఎనిమిది వారాలు పనులు చేయగా, రెండు వారాలకే డబ్బులు పడ్డాయి. ఇప్పటి వరకు మిగిలిన మొత్తాన్ని ఇవ్వలేదు. గ్రామాల్లో పనులనూ కల్పించడంలేదు.

– లక్ష్మి, లక్ష్మీనారాయణపురం

పనులు కల్పించడంలేదు



గ్రామంలో ఉపాధి పనులను కల్పించడంలేదు. గతంలో చేసిన వాటికి డబ్బులివ్వలేదు. ఆరు వారాలకు సంబంధించిన వేతనాలు రావాల్సి ఉంది.

– శ్రీదేవి, లక్ష్మీనారాయణపురం

బకాయిలు చెల్లించాలి



పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. నెలల తరబడి వీటిని మంజూరు చేయకపోతే ఎలా బతకాలి. వీటిని అందజేసేలా చొరవ చూపాలి.

– చిన్నయ్య, లక్ష్మీనారాయణపురం

త్వరలో అందజేసేలా చర్యలు

ఉపాధి పనులకు హాజరయ్యే శ్రామికులకు వేతన బకాయిలను త్వరలో చెల్లించేలా చర్యలు చేపడతాం. వీరి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమవుతుంది. పనిదినాలు పెంచేలా రాష్ట్ర అధికారులు చర్యలు చేపడుతున్నారు. – గంగభవానీ, డ్వామా పీడీ

క్లుప్తంగా

8 నుంచి ఇంటర్వ్యూలు

నెల్లూరు రూరల్: నెల్లూరు పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా పాలసీలు స్వీకరించేందుకు ఏజెంట్ నియామకానికి సంబంధించి ఈనెల 8 నుంచి 30వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నెల్లూరు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 65 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు రూ.5వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు 0861 2331748 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో కొండచిలువ



దుత్తలూరు: స్థానిక దుత్తలూరు తహసీల్దార్ కార్యాలయంలోకి బుధవారం సాయంత్రం కొండచిలువ వచ్చింది. దీంతో కార్యాలయ సిబ్బంది ఒక్కసారిగా హడలిపోయారు. కొంతసేపటి తర్వాత అది చెట్లలోకి వెళ్లిపోయింది.

పీఆర్ ఎస్ఈగా వైకే



యరమాల కోటేశ్వరరావు

టంగుటూరు: మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన యరమాల కోటేశ్వరరావు (వైకే) నెల్లూరు పంచాయతీరాజ్ విభాగం ఎస్ఈగా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకూ ఆయన కందుకూరు ఈఈగా, ఒంగోలు ఇన్‌చార్జి ఈఈగా పని చేశారు. వైకేకి ఇటీవల ఎస్ఈగా పదోన్నతి లభించి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్ఈగా నియమితులయ్యారు. ఏఈగా, డీఈగా, ఈఈగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ప్రతి దశలో ఉన్నతాధికారుల మన్ననలు అందుకుని ఎస్ఈ స్థాయికి ఎదిగారు. భవిష్యత్‌లో ఇంజినీర్ ఇన్ చీఫ్ స్థాయికి ఎదగాలని ఎంప్లాయిస్ యూనియన్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.అనిల్‌కుమార్, కె.అంజయ్య, ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు ఓఎస్‌జీసీ వెంకటేశ్వర్లు, కె.చిరంజీవి, నాయకులు వై.జయబాబు, వై.కృష్ణారావు, వై.రాజు, వై.ఎలీషా ఆకాంక్షించారు. వైకేని వైఎస్సార్‌సీపీ అనంతవరం నాయకులు ఏవీఎస్ రాజు, శారీమందిర్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కసుకుర్తి కోటేశ్వరరావు, సర్పంచ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, సుబ్బరాజు, నాగరాజు, కె.చినబాలకోటయ్య, కె.వెంకట్రావు తదితరులు అభినందించారు.

పెంచలకోనలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పవిత్రోత్సవాల అంకురార్పణకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పవిత్రాలు తీసుకొస్తూ..

రాపూరు: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం రాత్రి పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయంలో నిత్య పూజల సమయంలో తెలిసీ తెలియక సంభవించే సకలదోష నివారణ కోసం పాంచరాత్రాగమానుసారం పవిత్రోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి తెలిపారు. మూడురోజులు కార్యక్రమాలు జరుగుతాయి. ప్రత్యేకంగా పట్టుతో తయారు చేసిన పవిత్రమాలలకు వివిధ పూజలు నిర్వహించి స్వామి మీద ఉంచి చతుస్థానార్చన (అభిషేకం) చేస్తామన్నారు. స్వామి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం శ్రీవారి నందనవనం నుంచి పుట్ట మట్టి తీసుకొచ్చి అందులో నవధాన్యాలు కలిపి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మత్సంగ్రహణం, స్వామికి స్నపన తిరుమంజనం జరిగింది. అనంతరం శ్రీవారికి పవిత్రాలు ప్రతిష్ఠ, ఆధివాసహోమం, పవిత్ర సమర్పణ, శాత్తుమొఱై, నిర్వహించారు. దీంతో పవిత్రోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమం ప్రారంభమైందని అర్చకులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో వివిధ విభాగాల్లో నియామకాలు

కందుకూరు: వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లా రైతు విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా వలేటివారిపాళేనికి చెందిన కట్టా హనుమంతరావు, జనరల్ సెక్రటరీ, సెక్రటరీలుగా కందుకూరుకు చెందిన సూరం శ్రీనివాసరెడ్డి, అప్పారెడ్డి రాజమోహన్‌రెడ్డి, కార్యనిర్వహణ సభ్యులుగా గుడ్లూరు, ఉలవపాడు, లింగసముద్రం మండలాల నుంచి పోటి వెంకటేశ్వర్లు, చింతం గోపాల్‌రెడ్డి, కొమ్మి పోతులూరయ్య, డబ్బుగొట్టు రసూల్, గంగవరపు నాగేశ్వరరావు నియమితులయ్యారు.

• జిల్లా యూత్ వింగ్ సెక్రటరీగా ఉలవపాడుకు చెందిన కోటు కోటయ్య, కార్యనిర్వహణ సభ్యులుగా వలేటివారిపాళెం, కందుకూరు పట్టణానికి చెందిన జాగర్లమూడి రాంబాబు, యల్లావుల మురళి ఎంపికయ్యారు. సోషల్ మీడియా విభాగం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా కందుకూరుకు చెందిన దొడ్డంరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, సోషల్ మీడియా సెక్రటరీగా గుడ్లూరుకు చెందిన చిట్టేలు సురేష్‌బాబు, కార్యనిర్వహణ సభ్యులుగా ఉలవపాడు, వలేటివారిపాళేనికి చెందిన నల్లభుని రావిరాజు, నత్తా రజనీకాంత్ నియమితులయ్యారు.

• మహిళా విభాగం జిల్లా జనరల్ సెక్రటరీగా ఉలవపాడుకు చెందిన గొల్లపోతు తిరుపతమ్మ, కార్యనిర్వహణ సభ్యులుగా లింగసముద్రానికి చెందిన బత్తులకుమారిని నియమించారు. జిల్లా అనుబంధ విభాగాల్లో తమ నియామకానికి కృషి చేసిన కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఏఓఐ పోరాటంతోనే జీఎస్టీ తొలగింపు

• రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్

నెల్లూరు(అర్బన్): ఎంపీలను కలిసి పార్లమెంట్‌లో చర్చించేలా చేయడం, ప్రజల నుంచి సంతకాల సేకరణ, చలో ఢిల్లీ తదితర కార్యక్రమాలతో ఏఓఐ చేసిన పోరాటం వల్లే కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ పాలసీదారులపై విధించిన జీఎస్టీని తొలగించిందని ఏఓఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్ తెలిపారు. గురువారం ఎల్ఐసీ వార్షికోత్సవ ముగింపు సభ సందర్భంగా నెల్లూరు బృందావనంలోని సిటీ బ్రాంచ్ – 2లో జరిగిన కార్యక్రమంలో రాజశేఖర్ మాట్లాడారు. దేశ ఆర్థిక రంగానికి నిధుల అందించడంలో ఎల్ఐసీ విశేష కృషి చేసిందన్నారు. అందులో ఏజెంట్ల పాత్ర ఎంతో గొప్పదన్నారు. ప్రజల నుంచి సేకరించే ప్రీమియంను కేంద్ర ప్రభుత్వ పథకాలైన రోడ్లు, రైల్వేలు, పరిశ్రమలు, ప్రాజెక్ట్‌ల్లోనే పెట్టుబడులు పెడుతూ ప్రజా సంక్షేమంలో ఎల్ఐసీ పాత్ర పోషిస్తోందన్నారు. అలాంటి ఎల్ఐసీని ప్రైవేట్‌పరం కాకుండా పోరాటాలతోనే కాపాడుకుంటున్నామన్నారు. తమ పోరాటంతో పాలసీదారులపై విధించిన 18 శాతం జీఎస్టీ తొలగించడం భవిష్యత్ పోరాటాల విజయానికి మెట్టులాంటిదన్నారు. ఎల్ఐసీని కాపాడుకుంటూ ఏజెంట్ల సంక్షేమానికి సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఓఐ సీనియర్ నాయకుడు హజరత్‌రెడ్డి, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ నరసింహులు, రంగారావు, ఏజెంట్లు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక..

• యువకుడి ఆత్మహత్య

సంగం: భరించలేని కడుపునొప్పితో క్షణికావేశంలో పురుగు మందు తాగిన గిరిజన యువకుడు నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని దువ్వూరు ఎస్టీ కాలనీకి చెందిన దుర్గయ్య (25) అవివాహితుడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం నొప్పి ఎక్కువ కావడంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు నెల్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం చేయించి బాధిత కుటుంబానికి అప్పగించారు. కేసు నమోదు చేశారు.

కండలేరులో 39.470 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 39.470 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 13.75 క్యూసెక్కులు నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,150, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

తహసీల్దార్‌పై చర్యలకు డిమాండ్

కలువాయి(సైదాపురం): కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మండల సమావేశాలకు రాని తహసీల్దార్‌పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 15 నెలలుగా సమావేశాలకు తహసీల్దార్ రాకుండా కింది స్థాయి అధికారులను పంపడం ఏమిటని ప్రశ్నించారు. గైర్హాజరు విషయమై సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కలువాయి, కుల్లూరు, చీపినాపి, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. తోపుగుంట, బాలాజీరావుపేట గ్రామాల్లో విద్యుత్ కోతలు తీవ్రంగా ఉన్నాయని, ఆ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆయా గ్రామ సర్పంచ్‌లు కోరారు. ఖాళీ బిందెలతో మహిళల నిరసనపై ఈనెల 2వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనంపై సభ్యులు స్పందించారు. పెన్నా బద్వేల్ పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మిని పలువురు సభ్యులు ప్రశ్నించారు. తక్షణమే తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంచల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ భవానీ పాల్గొన్నారు.

మహిళల్ని బెదిరించి..

• బంగారు చైన్ల అపహరణ

ఉలవపాడు: మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లిన ఘటన మండల కేంద్రమైన ఉలవపాడులో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఉలవపాడులోని అంకమ్మ గుడి సమీపంలో నివాసం ఉండే బడితల సుస్మిత రాణి గురువారం తెల్లవారుజామున ఇంటి తలుపు తీసి బాత్‌రూమ్ దగ్గరకు వెళ్లే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మెడలో ఉన్న 4 సవర్ల బంగారు చైన్ లాక్కొని వెళ్లిపోయాడు. ఆ సమయంలో పెద్దగా అరవడంతో భర్త, ఇంటి పక్కల వారు వచ్చి దొంగ కోసం వెతికినా ఉపయోగం లేకుండా పోయింది. ఎస్సై అంకమ్మ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

5 గ్రాములు

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని దుత్తపాడు గ్రామంలో బెండతోటలో మహిళా కూలీలను బెదిరించి వారి మెడలోని బంగారు చైన్లను అపహరించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై కసిరెడ్డి ప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి బెండతోటలో కాయలు కోసేందుకు వచ్చిన మహిళల వద్దకు వెళ్లి వారిని బెదించాడు. సుమారు రూ.40 వేల విలువైన 5 గ్రాముల బంగారు చైన్లను అపహరించుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక

జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు.



సుజా ఎస్.నాయర్



సీహెచ్ చెన్నయ్య



ముజీర్



డొమినిక్‌రెడ్డి

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఎంబీఏ విభాగం అధ్యాపకురాలు సుజా ఎస్.నాయర్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. దీనిని శుక్రవారం అమరావతిలో అందుకోనున్నారు. ఆమెను వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఇతర అధ్యాపకులు అభినందించారు.

• బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వినూత్న బోధన, విస్తృతంగా సమాజ సేవా కార్యక్రమాలు చేస్తున్న సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీహెచ్ చెన్నయ్య అవార్డుకు ఎంపికయ్యారు. ఎంఈఓలు దిలీప్‌కుమార్, రత్నం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

• ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేట ఎంకేఆర్ ఉన్నత పాఠశాలకు చెందిన డొమినిక్‌రెడ్డి, నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ముజీర్ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈఓ ఎస్వీ నాయక్ గురువారం తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

• తహసీల్దార్ల సమావేశంలో బొప్పరాజు



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

నెల్లూరు(అర్బన్): ప్రజా సమస్యల పరిష్కారానికి, వారి హక్కులను కాపాడేందుకు, భూ సంబంధిత రికార్డుల నిష్పక్షపాత నిర్వహణకు రెవెన్యూ వ్యవస్థలో కీలకమైన తహసీల్దార్లు అంకితభావంతో కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటరాజేష్ సూచించారు. గురువారం సాయంత్రం నెల్లూరులోని నెల్లూరు క్లబ్ సమావేశ మందిరంలో జరిగిన తహసీల్దార్ల సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా నిజాయితీతో పనిచేస్తూ ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలని తెలిపారు. అదే సందర్భంలో ఉద్యోగులకు ప్రభుత్వం కూడా పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. తహసీల్దార్లు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా పనిచేసే అవకాశం ఇవ్వడం ద్వారా పారదర్శక పాలన అందిస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు గురించి మాట్లాడారు. పరిష్కార మార్గాల గురించి చర్చించారు. సంఘం బలోపేతంగా ఉండటం ద్వారా ఉద్యోగుల హక్కులను సాధించుకోవచ్చని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు అల్లంపాటి పెంచలరెడ్డి, డానియేల్ పీటర్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ మురళి, జిల్లాలోని పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లకు అన్యాయం



మాట్లాడుతున్న సుధాకర్‌రావు తదితరులు

నెల్లూరు(అర్బన్): వైద్యారోగ్య శాఖలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న సుమారు 170 మందికి పైగా హెల్త్ అసిస్టెంట్లను ఉమ్మడి రాష్ట్ర ప్రాతిపదికంటూ తెలంగాణ కోర్టు తీర్పును అనుసరించి ప్రభుత్వం తొలగించి తీరని అన్యాయం చేసిందని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు పేర్కొన్నారు. ఇటీవల జిల్లాలో తొలగించబడిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లకు చెందిన కుటుంబాలను ఏపీ హంస నాయకులు గురువారం పరామర్శించారు. వారు పడుతున్న కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంతపేట సమీపంలో జరిగిన విలేకరుల సమావేశంలో సుధాకర్‌రావు మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాలు కల్పించారన్నారు. వీరంతా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలతోపాటు కోవిడ్ సమయంలో ప్రజలకు ఎంతగానో సేవలందించారన్నారు. రెగ్యులర్ అవుతామనే ఆశతో విధులు నిర్వర్తిస్తుండగా తెలంగాణ కోర్టు తీర్పును ఏపీకి ఆపాదించి వందలాది మందిని తొలగించారన్నారు. పిల్లల్ని చదివించుకోలేక, అద్దెలు కట్టలేక, వయో పరిమితి దాటి పోవడంతో వేరే ఉద్యోగాలు రాక వారంతా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తిరిగి విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ హంస తాలూకా ప్రెసిడెంట్ సోమేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాపారావు, ఉద్యోగ సంఘం నాయకులు స్టీఫెన్ కుమార్, జాన్ అంకయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు ఎప్పుడో?



దర్గాలో ఏర్పాటు చేసిన హుండీలు



ఖాజానాయబ్ రసూల్ దర్గా

• 18 నెలలుగా ఏఎస్‌పేట దర్గాలో ఇదే పరిస్థితి
• మాజీ పీఠాధిపతి కోర్టుకు వెళ్లడంతో బ్రేక్
• రాజకీయ పెత్తనంపై భక్తుల ఆవేదన

ఆత్మకూరు: ఏఎస్‌పేటలోని హజరత్ నాయబ్ రసూల్ దర్గాలో ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకలను 18 నెలలుగా లెక్కించలేదు. సాధారణంగా దర్గా నిబంధనల ప్రకారం గంధోత్సవానికి వారం రోజులుగా ముందుగా కానుకలు లెక్కిస్తారు. 18 నెలల నుంచి కానుకల్ని లెక్కించలేదు. హుండీల్లో సుమారు రూ.4 కోట్లు ఉంటుందని అంచనా. అయితే మాజీ పీఠాధిపతి హాఫీజ్‌పాషా కోర్టుకు వెళ్లడంతో హుండీలు లెక్కించలేదని తెలుస్తోంది. తన కుటుంబీకుల స్థలంలో ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించాలనుకుంటే అనుమతి తీసుకోవాలని ఆయన కోర్టుకు వెళ్లినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం దర్గా మేనేజర్‌గా వ్యవహరిస్తున్న హుస్సేన్ ఈ విషయాలను రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాలతో హుండీలు ఏర్పాటు చేసిన స్థలాలను కొలతలు వేయించారు. అవి హాఫీజ్‌పాషా కుటుంబీకులకు చెందిన స్థలంలో లేవని నిర్ధారణ అయిన అనంతరం లెక్కించేందుకు ప్రయత్నించగా మాజీ పీఠాధిపతి కంటెంట్ ఆఫ్ కోర్టు నోటీసులు ఇప్పించారని మేనేజర్ హుస్సేన్ తెలిపారు. వాస్తవానికి దర్గాలో ఐదు ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన 14 హుండీలు పూర్తిగా దర్గాకే చెందుతాయన్నారు. మూడు రోజులుగా దొరసానమ్మ గంధం జరుగుతున్న క్రమంలో వక్ఫ్ బోర్డు ఆదేశాలతో ప్రత్యేకంగా ఐదు హుండీలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. భక్తులు కానుకలను నూతనంగా ఏర్పాటు చేసిన ఐదు హుండీల్లో వేయాలని తెలిపారు. కాగా 14 హుండీల్లోని కానుకలను లెక్కించేంత వరకు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. పవిత్ర దర్గాలోనూ రాజకీయం, స్వార్థం చోటు చేసుకోవడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమాజ నిర్మాణంలో టీచర్లదే కీలకపాత్ర



వేడుకల్లో పాల్గొన్న వీసీ శ్రీనివాసరావు తదితరులు

• వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ నేటి కాలంలో ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా విద్యా రంగాన్ని అభివృద్ధి దిశగా నడిపించగల శక్తులుగా మారాలన్నారు. విద్యార్థులలో పాఠ్య జ్ఞానం మాత్రమే కాకుండా మానవీయ విలువలు, నైతికత, సామాజిక బాధ్యతలను పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. వీఎస్‌యూ ఎంబీఏ విభాగం అధ్యాపకురాలు సుజా ఎస్.నాయర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో డీకే కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సి.శారద, వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు సహకారం



ప్రైవేట్ ఆస్పత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): టీబీ రహిత జిల్లాగా నెల్లూరును మార్చేందుకు ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు సహకరించాలని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ కోరారు. గురువారం ఆయన తన బృందంతో కలిసి నగరంలోని అరవింద్ కిడ్నీ సెంటర్, పలు కార్పొరేట్ ఆస్పత్రులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడుతూ నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలో పెద్ద సంఖ్యలో రోగులకు స్క్రీనింగ్ కార్యక్రమం వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టామన్నారు. అలాగే ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే రోగుల్లో ఎవరికైనా రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం వస్తుంటే అలాంటి వారిని ప్రభుత్వాస్పత్రికి పంపి గళ్ల పరీక్ష చేయించాలని కోరారు. బరువు తగ్గినా, ఆకలి మందగించినా కూడా టీబీ ఆస్పత్రికి రెఫర్ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీబీ నిర్ధారణ అయితే రోగికి మందులతోపాటు పౌష్టికాహారానికి నగదు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పబ్లిక్, ప్రైవేట్ మిక్స్ కో–ఆర్డినేటర్ హరీష్, భవ్య సంస్థ కో–ఆర్డినేటర్ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు(కిలో)



పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.30
పండ్లు	: రూ.15

నెల్లూరు పౌల్ట్రీ ధరలు



బ్రాయిలర్:	రూ.110
లేయర్	రూ.123
బ్రాయిలర్ చికెన్:	రూ.204
స్కిన్‌లెస్ చికెన్:	రూ.226
లేయర్ చికెన్:	రూ.210